రూ.2లక్షల ఎల్వోసీ మంజూరు



బాధిత కుటుంబ సభ్యుడికి ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 20: ఉమ్మడి కొండపాక మండలంలోని ఎర్రవల్లికి చెందిన మ్యారమైన రజిత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు దవాఖానలో చేరారు. ఆమె ఆర్థిక పరిస్థితిని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన హరీశ్ రావు రూ.2లక్షల ఎల్వోసీని మంజూరు చేయించారు. గురువారం ఎల్వోసీని ఎమ్మెల్సీ యాదవరెడ్డి బాధితురాలి భర్త మల్లేశానికి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబం మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ప్రవీణ్‌కుమార్ పరామర్శ

మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బెజ్జంకి, ఫిబ్రవరి 20: మండలంలోని ముత్తన్నపేట గ్రామానికి చెందిన స్వీరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొర్ర సురేశ్‌కుమార్ తల్లి బుచ్చవ్వ ఇటీవల మరణించగా స్వీరోస్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతిరాలి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, బిగుళ్ల మోహన్, ఉప్పులేటి బాబు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొమటిబండలో మృతుడి కుటుంబీకులను పరామర్శిస్తున్న మాదాసు శ్రీనివాస్

వర్గల్: మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సాదుల్లాగౌడ్

గజ్వేల్, ఫిబ్రవరి 20: మున్సిపల్ పరిధిలోని మూడో వార్డులో అనారోగ్యంతో లక్ష్మీనర్సింహులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మర్కంటి కనకయ్య, శ్రీరామ్ మల్లేశం పాల్గొన్నారు. అనంతరం కోమటిబండకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఉబ్బని ప్రభాకర్ తండ్రి నర్సయ్య ఆకస్మాత్తుగా మృతిచెందడంతో మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్ గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, పార్టీ కోసం చేసిన సేవలను గుర్తుచేశారు. మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కృష్ణగౌడ్, మండ ల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్, భాస్కర్, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

జెబ్బాపూర్‌లో..

వర్గల్, ఫిబ్రవరి 20: వర్గల్ మండలం జెబ్బాపూర్‌లో బుధవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతిచెందిన లింగాప్రశాంత్ కుటుంబీకులను గురువారం ఉదయం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మండల ఎంపీటీసీల ఫోరం ఉపాధ్యక్షుడు గౌరయ్యగారి సాదుల్లా గౌడ్ పరామర్శించారు. పేద కుటుంబానికి చెందిన ప్రశాంత్ తన ఉజ్వల భవిష్యత్ కోసం ఎన్నో కలలు కన్న యువకుడని, పోలీస్ ఉద్యోగ సాధనలో అకాలంగా అసువులు బాయడం కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగిల్చిందన్నారు. కార్యక్రమంలో నెంటూర్ బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కిచ్చుగారి కనకరాజు, జెబ్బాపూర్ మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సమస్య పరిష్కారం

- కెపాసిటీ సరిపోక పోవడంతో ఇబ్బందిపడిన అక్కెనపల్లి రైతులు
- స్పందించి అధికారులతో మాట్లాడిన హరీశ్‌రావు

నూతన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అక్కెనపల్లి రైతులు

నంగునూరు, ఫిబ్రవరి 20: ఎన్నో రోజులుగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యను మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించి పరిష్కరించారు. మండల పరిధిలోని అక్కెనపల్లిలో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది.. దానిపై 258 మోటర్లు ఉండటంతో కెపాసిటీ సరిపోక తరచుగా కాలిపోయేది. చాలా రోజుల నుంచి సమస్య తలెత్తడంతో ఇటీవల రైతులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి విద్యుత్ శాఖ ఎస్ఈకి లేఖ ద్వారా హరీశ్ రావు ఆదేశించారు. ఈమేరకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీని పెంచుతూ గురువారం మరొక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను మాజీమంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి మరో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించి అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. రైతులు హరీశ్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాతూరి మల్లారెడ్డి, బద్దిపడగ వెంకట్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, అయిలయ్య, కొమురయ్య, తిరుపతి, మొండయ్య, నర్సింహులు, రాజయ్య ఉన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఏడీఏకు వినతి పత్రం అందజేస్తున్న రవీందర్ గౌడ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 20: హుస్నాబాద్ సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఫోర్జరీ సంతకాలు చేసి, లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడిన వ్యవసాయ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతు ఐక్యత సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి హుస్నాబాద్ ఏడీఏ శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఫోర్జరీ సంతకాలు చేసి పంట సాగు చేయని రైతుల పేరును సీసీఐలో విక్రయించే విధంగా అక్రమాలకు పాల్పడిన మండల వ్యవసాయ శాఖ అధికారి, మార్కెట్ కార్యదర్శి, సీసీఐ ఇన్‌చార్జి అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్

మహిళా డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్‌పై మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణ

గజ్వేల్, ఫిబ్రవరి 20: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం విద్యార్థుల పరిశోధన, అకడమిక్ రైటింగ్ నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ప్రాజెక్టు రిపోర్టు రైటింగ్‌పై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత అబ్రహం మాట్లాడుతూ వృత్తిపరమైన విద్యలో నిర్మాణాత్మక పరిశోధన, నివేదిక రచన ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ రామకృష్ణ, కమలాక్రిస్టియాన, డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

అటానమీ వ్యవస్థ అమలుపై..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో స్వయం ప్రతిపత్తి అటానమస్ వ్యవస్థ అమలు విధానంపై వర్క్‌షాప్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖిత్ అంజుమ్ తెలిపారు. కార్యాక్రమానికి సిద్దిపేట డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గోపాలసుదర్శనం హాజరై ప్రసంగించారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి

- కలెక్టర్ మనుచౌదరి

గట్లమల్యాల ఎస్సీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

నంగునూరు, ఫిబ్రవరి 20: మెనూ ప్రకారం అల్పాహారం, భోజనంతోపాటు స్నాక్స్ కచ్చితంగా అందించాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని గట్లమల్యాల గ్రామంలోని ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు బాలికల డార్మెటరీ, వంట గది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. బాత్‌రూమ్‌లకు సరిగా డోర్లు లేకపోవడంతో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మాధవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికల హాస్టల్‌లో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చి డోర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వంట పాత్రల కొరత ఉంటే జిల్లా వ్యాప్తంగా అన్ని ఎస్సీ హాస్టళ్లలో పరిశీలించి, వాటి కొనుగోలు కోసం ప్రతిపాదనలు పంపాలని జిల్లా ఇన్‌చార్జి ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి హమీద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీవో లక్ష్మప్ప పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి తేవాలి

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని జూన్ మొదటి వారంలోగా అందుబాటులోకి తేవాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. నంగునూరు మండలం నర్మెటలో నిర్మాణంలో ఉన్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత పని పూర్తయింది.. ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయని ఆరా తీశారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా హార్టికల్చర్, సెరి కల్చర్ అధికారి సువర్ణ, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో లక్ష్మప్ప పాల్గొన్నారు.

మా భూముల్లో సర్వే చేయొద్దు

- ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసిన భూనిర్వాసిత రైతులు



ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

సిద్దిపేట, ఫిబ్రవరి 20: సిరిసిల్ల–సూర్యాపేట నేషనల్ హైవే కోసం మా భూముల్లో సర్వే చేయొద్దని, తాము తీవ్రంగా నష్టపోతున్నామని భూనిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తూ గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో సదానందానికి భూములు ఇవ్వమని తెల్చి చెప్పారు. రోడ్డు నిర్మాణ పనులపై ఆర్డీవోతో చర్చించినా ఫలితం లేదన్నారు. ఈ విషయంపై గతంలో కలెక్టర్, అధికారులతో చర్చించామని గుర్తు చేశారు. రోడ్డు నిర్మాణం తమ గ్రామాల మీదుగా జరగడం ద్వారా 18 కిలోమీటర్లు దూరం పెరుగుతుందన్నారు. దుద్దెడ టోల్ గేట్ వరకు రావాల్సిన అవసరం లేకుండా వెలకట్ట గ్రామం మీదుగా రోడ్డు మళ్లిస్తే నష్టం తక్కువ ఉంటుందని, ఈ విషయంపై అధికారులు పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. కొంతమంది స్వార్థం కోసం తమ గ్రామాల మీదుగా రోడ్డు నిర్మాణ పనులు చేపడితే అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు.

ఈజీఎస్‌లో హార్టికల్చర్ పనులు చేపట్టాలి

అలిరాజీపేటలో నర్సరీని పరిశీలిస్తున్న జయ్‌దేవ్ ఆర్య

జగదేవపూర్ ఫిబ్రవరి 20: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 100 ఎకరాల్లో హార్టికల్చర్ పనులు చేపట్టాలని, నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయ్‌దేవ్ ఆర్య అన్నారు. గురువారం మండలంలోని అలిరాజీపేట గ్రామాన్ని సందర్శించిన ఆయన మండల అభివృద్ధి అధికారి యాదగిరి, ఎంపీవో ఖాజామొహినొద్దీన్‌లతో కలసి నర్సరీలను తనిఖీ చేశారు. ఈజీఎస్ పనులను పర్యవేక్షించి కూలీలతో మాట్లాడారు. అనంతరం మండల కార్యాలయంలో ఈజీఎస్ అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. పల్లెల్లో ఫాంపాండ్స్, పశువుల పాకలు, పొలాలకు మట్టి రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని, గుట్టల చుట్టూ ట్రెంచ్‌లు కొట్టాలని, కందకాలు తీయాలని సూచించారు. ప్రతి గ్రామంలో రోజూ 25 మంది కూలీలకు తగ్గకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శైలజ, ఈసీ సుధాకర్ టీఏలు బాలకృష్ణ, ఫీల్డు అసిస్టెంట్స్, సెక్రటరీస్ ఉన్నారు.

మల్లన్న ఆలయంలో హుండీల లెక్కింపు

నగదు లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

చేర్యాల, ఫిబ్రవరి 20: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం హుండీలను లెక్కించారు. ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో శరభేశ్వర స్వామి ఆలయ ఈవో రవికుమార్ పర్యవేక్షణ, ఎస్ఐ రాజు బందోబస్తు మధ్య ఆలయ హుండీలను మహా మండపంలో లెక్కించారు. 24 హుండీలను ఆలయ అర్చకులు, ఉద్యోగులు, తాత్కలిక సిబ్బంది, శ్రీ లిలత సేవా ట్రస్ట్ సేవా సమితి సభ్యులు లెక్కించారు. లెక్కింపులో రూ. 78,31,047నగదు, 82 గ్రాముల మిశ్రమ బంగారం, 5 కిలోల 100 గ్రాముల మిశ్రమ వెండి, 13 క్వింటాల్ల బియ్యం, 130 నోట్లు ఇతర దేశాల కరెన్సీ లభించింది. నగదును స్థానిక టీజీబీలో జమ చేశామని ఈవో తెలిపారు. ఆలయ ఏఈవో శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్, పాలక మండలి సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, ఒగ్గు పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రతిభ కనబర్చాలి

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న రాజేందర్‌రెడ్డి

కొమురవెల్లి, ఫిబ్రవరి 20: 'పది' ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బొంగు రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కొమురవెల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఎంఈవో రమేశ్‌తో కలిసి పరీక్ష ప్యాడ్లు, సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, సామగ్రి అందజేస్తామన్నారు. పదో తరగతిలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10,116, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5,116 అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యుడు గజ్జే వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేబర్ బోర్డు కమిషనర్‌ను నియమించాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 20 : రాష్ట్రంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే లేబర్ బోర్డు కమిషనర్‌ను నియమించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు చెప్పుకోవడానికి రాష్ట్రంలో సరైన అధికారి లేకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15నెలల కావస్తున్నా కమిషనర్‌ను నియమించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తక్షణమే కార్మికుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఎల్ ఐసీలో నియామకాలు చేపట్టాలి

హుస్నాబాద్ ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 20: దేశంలో అతిపెద్ద బీమారంగ సంస్థ ఎల్ఐసీలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హుస్నాబాద్‌లోని బ్రాంచ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సదాశివరెడ్డి, రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ ఎల్ఐసీపై ఎలాంటి భారం పడకుండా క్లాస్‌త్రీ, క్లాస్ ఫోర్, అసిస్టెంట్స్, సబ్‌స్టాఫ్ ఉద్యోగాల నియామకాలు చేపట్టాలన్నారు. ఇన్సూరెన్స్ రంగంలో వందశాతం ఎఫ్‌డీఐల అనుమతిని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు కరుణాకర్, సంయుక్త కార్యదర్శులు వెంకటరాజం, అశోక్‌కుమార్, కోశాధికారి కిషన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిర్దిష్టమైన లక్ష్యంతో పరీక్షలు రాయాలి

విద్యార్థులతో వివరాలు తెలుసుకుటున్న అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్

తొగుట, ఫిబ్రవరి 20: పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా పూర్తిగా మనసు లగ్నంచేసి విద్యనభ్యసించాలని అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. గురువారం తొగుట మండంలోని రాంపూర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు భోజనం, తాగునీటి విషయాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉపాధ్యాయ బృందం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తొగుట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణ

పిడిచేడ్‌లో శివాజీ విగ్రహావిష్కరణ చేపడుతున్న నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 20: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని పిడిచేడ్‌లో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ శివాజీ అన్ని వర్గాల అరాధ్యదైవంగా నిలుస్తూ హిందూ ధర్మాన్ని ప్రపంచ వ్యాప్తం చేశారన్నారు. భారతీయులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన శివాజీ మహారాజ్ అగుడు జాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మల్లేశం, మాజీ సర్పంచ్‌లు నాగిరెడ్డి, శిల్పాఅశోక్, పిట్ల రాములు, కొమురయ్య, పాండు, నాయకులు హన్మంతరెడ్డి, మాజీ ఎంపీటీసీ కిష్టయ్య, హైందవ సోదరులు అంజయ్య శర్మ, శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని దవాఖానలపై చర్యలు

సిద్దిపేట, ఫిబ్రవరి 20: నాణ్యమైన వైద్యసేవలు అందించాలని, అవసరం లేకున్నా పరీక్షలు నిర్వహించరాదని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.పల్వన్ కుమార్ అన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆనంద్ నేతృత్వంలోని వైద్యబృందం సిద్దిపేట పట్టణంలోని మెడి కేర్ రిచ్ సూపర్ స్పెషాలిటీ, మేఘన మల్టీ స్పెషాలిటీ దవాఖానల్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మెడికేర్ రిచ్ సూపర్ స్పెషాలిటీలో సేవలకు సంబంధించిన పట్టిక ప్రదర్శించలేదని, మేఘన దవాఖానలో 5 నుంచి 6 అనవసర సీజేరియన్ నిర్వహించినట్లు పరిశీలనలో తేలిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి దవాఖానలో సేవలకు సంబంధించిన సూచిక బోర్డులు తప్పకుండా ప్రదర్శించాలని, అనవసర పరీక్షలు చేయరాదని, ఫేక్ రిపోర్టుల ద్వారా చికిత్సలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అధిక ఫీజులతో పాటు, గర్భిణులకు హైరిస్క్ లక్షణాలు లేకున్నా సిజేరియన్ చేస్తే చర్యలు తప్పవన్నారు. దవాఖానల యాజమాన్యాలు కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా లేదా రెన్యువల్ చేసుకోవాలన్నా జిల్లా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ప్రతినెలా దవాఖానల్లో నిర్వహించిన వివిధ ఆరోగ్య సేవలకు సంబంధించిన సమాచారాన్ని హెచ్ఐఎంఎస్ పోర్టల్ (ఆన్లైన్)లో ప్రతినెలా రెండో తేదీలోపల సమర్పించాలని, విరుద్ధంగా ప్రవర్తిస్తే దవాఖాన సీజ్ చేయడంతోపాటు జరిమానా, డాక్టర్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ రద్దుకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

బాలల హక్కులపై అవగాహన

వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 20: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జడ్జి స్వాతిరెడ్డి కొండపాక శివారులోని ఆనంద నిలయంలో బాలసదన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి స్వాతిరెడ్డి బాలల హక్కులతో పాటు హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వృద్ధశ్రమాన్ని సందర్శించి వారితో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఆనంద నిలయం పర్యవేక్షకులు వైకుంఠం, లోక్‌అదాలత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి

మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి

రాయపోల్, ఫిబ్రవరి 20: ప్రతి విద్యార్థి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో కచ్చితంగా పొందుపర్చాలని జిల్లా సెక్టోరియల్ స్టాటిస్టికల్ అధికారి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం దౌల్తాబాద్‌లో మండలస్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గజ్జల కనుకరాజుతో కలిసి ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పూర్తి సమాచారాన్ని ఉపాధ్యాయులు సేకరించి ఆల్‌లైన్ చేయాల్సి అవసరం ఉందన్నారు. డైస్ పాఠశాలలో అభివృద్ధి సూచికలు ఉంటాయని, ఆ సూచికలను పాఠశాల స్థాయిలో తప్పకుండా నిర్వర్తిస్తూ అమలు చేయాలన్నారు. అపార్ కార్డు పెండింగ్‌లో ఉన్నటువంటి పాఠశాలల్లో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, బాసిత్, ఉపాధ్యాయులు వెంకట లక్ష్మి, మండల వనరుల కేంద్రం సిబ్బంది శేఖర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వస్తున్న వాహనదారులను వెనక్కి పంపుతున్న అధికారులు

నిబంధనలు పాటించాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 20: రవాణా శాఖ నిబంధనలను కఠినతరం చేసింది. నిబంధనలు పాటించకపోతే రవాణా శాఖ కార్యాలయంలోకి అనుమతిని నిరాకరిస్తున్నారు. రక్షణ కవచం హెల్మెట్‌పై విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ముందుగా తమ కార్యాలయం నుంచి ప్రాంభించాలని పూనుకున్నారు. రవాఖా శాఖ కార్యాలయానికి వచ్చే వాహదారులు విధిగా హెల్మెట్ ధరించి వస్తేలోనికి అనుమతిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంవీఐ శంకర్‌నారాయణ మాట్లాడుతూ.. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి యువత నిండుప్రాణాలను పోగొట్టుకుంటున్నారని, ఫిబ్రవరిలో హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడి 45 మంది మృతి చెందారన్నారు .ఇలంటి విషాదకర ఘటనలు తనను కలిచివేశాయని .. పునరావృత్తం కాకుండా ఉండాలనే సంకల్పంతో రవాణా శాఖ కార్యాలయానికి వచ్చే వాహనాదారులు హెల్మెట్ ధరించి వస్తేనే అనుమతి ఇస్తున్నామన్నారు. అందరూ ప్రమాదాల నివారణకు వాహనదారులు సీటు బెల్ట్, విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

కొమురవెల్లి, ఫిబ్రవరి 20: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసిన ఘటన కొమురవెల్లి మండలంలోని మర్రిముచ్చాలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప